క్లుప్తంగా

తహసీల్దార్ జితేంద్ర సేవలు అభినందనీయం



బదిలీ అయిన తహసీల్దార్ జితేంద్రను సత్కరిస్తున్న దెందులూరు ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రియదర్శిని

దెందులూరు: దెందులూరు తహసీల్దార్‌గా వి.జితేంద్ర అందించిన సేవలు అభినందనీయమని దెందులూరు ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రియదర్శిని అన్నారు. బుధవారం బదిలీ అయిన తహసీల్దార్ జితేంద్రను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్‌ఓల సంఘం మండల అధ్యక్షులు కిషోర్, వీఆర్‌ఓలు శ్రీనివాస్,రామకృష్ణ, అనిరుద్, కృష్ణవేణి, రాము తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఆజామ్



సయ్యద్ ఆజామ్ సాహెబ్

భీమడోలు: నూర్‌బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అంబర్‌పేటకు చెందిన వైఎస్సార్ సీపీ మండల కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆజామ్ సాహెబ్‌ను నియమించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాజీ నుంచి ఆజామ్‌కు బుధవారం నియామకపత్రాలు అందాయి. సంఘంలో కీలక పాత్రను పోషించి, సంఘ ప్రతిష్టకు గౌరవం తెచ్చేలా మెలగానికి రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. నూర్‌బాషా ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆజామ్ పేర్కొన్నారు. ఆజాంకు రాష్ట్ర స్థాయి పదవి దక్కడంతో నూర్‌బాషా ముస్లిం మైనార్టీల పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



నారాయణపురం టూరింగుపేటలో జేసీబీను అడ్డుకున్న గ్రామస్తులు

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం గ్రామంలో టూరింగు పేటలో అక్రమంగా మట్టిని తవ్వుతున్న జేసీబీను గ్రామస్తులు అడ్డుకున్నారు. బుధవారం మధ్యాహ్నం శ్మశానవాటికలో మట్టిని తవ్వుతున్న జేసీబీను అడ్డుకుని పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేయడంతో ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కొత్త ఉంగుటూరు ప్రాంతంలో తవ్వకాలు చేసిన వారే నారాయణపురంలో తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్యే ధర్మరాజుకు సత్కారం



ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును సత్కరిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

ఉంగుటూరు: గౌడబలిజ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును ఉంగుటూరు క్యాంపు కార్యాలయం వద్ద సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు సంఘం అభివృద్ధికి సహకరిస్తానని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శీలం పల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మారిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దొంగల లక్ష్మీనారాయణరాజు ఉన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్) : పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి రైతులను మోసగించిన దళారులపై కఠిన చర్యలు తీసుకుని, రైతులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలోని సంఘ కార్యాలయంలో బుదవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డారు. కొయ్యలగూడెంలో రైతులు చేస్తున్న పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరుపున సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

జిల్లాలో ఉపాధి హామీ పనులు చేసిన వారికి చెల్లించాల్సిన రూ.110 కోట్లు వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు కారణంగా పనులు లేక కూలీలు, కౌలు రైతులు, పేద రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఉపాధి హామీ పనులు చేసిన వారికి 21 రోజుల్లో వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. నెలలు గడుస్తున్నా ఉపాధి హామీ వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ వేతనాలు చెల్లించాలని శ్రీనివాస్ కోరారు.

కృష్ణా డెల్టా శివారు భూములకు నీరందించాలి



రాజుపేట గ్రామంలో నారుమడులను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు

పెదపాడు: కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రాజుపేట గ్రామంలో ఆందోళన చేశారు. బుధవారం రైతు సంఘం నాయకులు రాజుపేటలోని సాగు నీరు అందని వరి నారుమళ్లను సాగు భూములను పరిశీలించారు. సాగునీరు అందక నారుమడులు బీటలు వారుతున్నాయని, నాట్లు ఆలస్యమవుతున్నాయని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, మండల కార్యదర్శి గుండపనేని సురేష్ మాట్లాడుతూ కృష్ణా డెల్టాకు శివారు ప్రాంతం కావడంతో సాగునీరు అందక రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నదుల్లో సమృద్ధిగా నీరు ఉన్నా పంటల సాగుకు మాత్రం నీరు అందడం లేదని చెప్పారు. కృష్ణా మెయిన్ కెనాల్‌కు తగినంత నీరు వదిలి శివారు ప్రాంత భూములుక అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పెదపాడు మండలంలోని రాజుపేట, వసంతవాడ, గోగుంట, తోటగూడెం, నాయుడుగూడెం తదితర గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీటి కొరత లేకుండా చూడాలని కోరారు. భూములు దమ్ము చేసుకుని నాట్లు వేసుకునేలా తగినంత నీరు అందేలా కృష్ణా కెనాల్‌కు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఆసుపత్రిలో మృతి చెందిన గుంట త్రిమూర్తులు

భీమడోలు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పూళ్లకు చెందిన గుంట త్రిమూర్తులు (29) ఆరేళ్ల కితం ప్రేమ వివాహం చేసుకుని జీవిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అప్పులు బాధ భరించలేక జూలై 29వ తేదీ రాత్రి పూళ్ల శివారు నాగేశ్వరరావుపేట భవానమ్మ గుడి సమీపంలోని పొలాల్లో గడ్డి మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న త్రిమూర్తులును చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి నాగేశ్వరరావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆరోగ్యంపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి చిన్న అనారోగ్యం కలిగినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సీఆర్‌ఆర్ మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు సూచించారు. స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో ఆశ్రం వైద్య కళాశాల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవాలని, రోజుకు కనీసం మూడు లీటర్ల మంచినీరు తాగాలని, తద్వారా జీర్ణక్రియను మెరుగుపరుచుకోవచ్చని, అలాగే కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ శిబిరంలో ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన వైద్యులు టీఎల్ ప్రసన్న, పీ కుసుమాంబిక, వై రమ్య, సింధు భార్గవి, ఆర్‌హెచ్ లక్ష్మి, రూపాలక్ష్మి విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో సుమారు 450 మంది విద్యార్థినులు, కళాశాల సిబ్బందికి బరువు, హిమోగ్లోబిన్, బీపీ పరీక్షలు నిర్వహించి అనంతరం మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ జీ సరళ పర్యవేక్షించారు.

ఎస్సై సాంబశివరావుకు ఆత్మీయ వీడ్కోలు



సాంబశివరావును సత్కరించిన జిల్లా ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కడియాల సాంబశివరావుకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన సాంబశివరావును జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఘనంగా సత్కరించి బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి ఏవిధమైన రిమార్కులు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయం అన్నారు. కానిస్టేబుల్ నుంచీ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ జీ.స్వరూపరాణి, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, బీ ఆదిప్రసాద్, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, సాంబశివరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు కమిషనర్‌గా చంద్రశేఖర్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా డీ చంద్రశేఖర్‌ను నియమిస్తూ డీఎంఏ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం నగర కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన సంక్రాంతి వెంకటకృష్ణ జూలై 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్‌గా నియమించారు. గురువారం నుంచి ఆయన ఏలూరు నగర కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. గతంలోనూ ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో ఆయనకు ఏలూరు నగరంపై పూర్తి అవగాహన ఉంటుందని చెబుతున్నారు.

పాటెమ్మతల్లికి ఆషాఢ సారె సమర్పణ



పాటెమ్మ తల్లికి ఆషాఢమాస సారె తీసుకెళ్తున్న భక్తులు

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడిలో ఉన్న పాటెమ్మ తల్లి అమ్మవారికి బుధవారం ఆలయ చైర్మన్ పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ యలమర్తి హేమలతా శ్రీనివాస్, భక్తులు ఆషాఢమాస సారెను పసుపు, కుంకుమను అందజేశారు. కమిటీ సభ్యులు యలమర్తి మోహన మురళీకృష్ణ, యలమర్తి బొర్రయ్య, రాంబాబు, రామయ్య ఆధ్వర్యంలో పెరుగ్గూడెం నుంచి118 మంది ముత్తయిదువలతో ఊరేగింపుగా చల్లచింతలపూడి వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు.

సమస్యలను పరిష్కరిస్తాం

పెదపాడు: ప్రజలు తమ సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే మీకోసం మీ చింతమనేని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలంలోని ఏపూరు అప్పనవీడు, కలపర్రు గ్రామాల్లో మీ కోసం మీ చింతమనేని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప్పలపాటి రాంప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, గుత్తా అనీల్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో దళితసేన

దెందులూరు: రాష్ట్ర వ్యాప్తంగా దళితసేన గత నాలుగు సంవత్సరాలుగా మౌలిక వసతుల కల్పన, విద్యా,వైద్యం, పేద బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. బుధవారం గోపన్నపాలెంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు దళితసేన 4వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 78 మందికి మెషీన్లు పంపిణీ చేశామన్నారు. భవిష్యత్‌లో పేదలు, దళితుల సమస్యల పరిష్కారం, అవగాహనా సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు తోడ్పాటు ఇస్తామన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో ఎన్నికలు

దెందులూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్, పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 309 ప్రాథమిక, మాధ్యమిక ఉన్నత పాఠశాలలకు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారని తెలిపారు.

కష్టపడితేనే ఉన్నత స్థితికి చేరుకోవడం సులభం



ఉత్తమ విద్యార్థిని డి.స్రవంతికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపల్ నిర్మల

గణపవరం: విద్యార్థి దశలో బాగా కష్టపడితేనే అతను ఉన్నత స్థాయికి ఎదుగుతారని గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి చివరి సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థులు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో చదువు పూర్తి చేసిన విద్యార్థులు ఆపై చదువుతో పాటు ఉద్యోగాన్వేషణలోనూ కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. కళాశాలలో చదువుతూ క్యాంపస్ ఇంటర్వ్యూలలో విజయం సాధించి ఉద్యోగాలు పొందిన విద్యార్థులను మిగిలిన వారు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం యూనివర్సిటీ నిర్వహించిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులు కె.హేమలత, డి.స్రవంతి, వై.కృష్ణకుమారి, వై.హారిక, సత్య శ్రావణిలకు ప్రిన్సిపల్ తదితరులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, ఐక్యూఏసీ సమన్వయకర్త సీహెచ్ చైతన్య, సీనియర్ అధ్యాపకుడే టి.అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన సామాజిక బాధ్యత



సెయింట్ గ్జేవియర్ పాఠశాల నుంచి నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దోమ అత్యంత ప్రమాదకరమైన కీటకమని, దోమలు ద్వారా వచ్చే వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు సూచించారు. స్థానిక సెయింట్ గ్జేవియర్ ఉన్నత పాఠశాలలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమ చిన్న కీటకమైనప్పటికీ దాని ద్వారా ప్రమాదకరమైన అంటూ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా విజృంభిస్తాయని, కాబట్టి విద్యార్థులు దోమకాటుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మనకి ఎక్కువగా హాని చేసే మలేరియా దోమ, డెంగీ దోమ మన గృహాలు, గృహ పరిసరాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయి కాబట్టి, వారానికి ఒకసారి మంచినీటి నిల్వ ప్రాంతాలైన తొట్టెలు, డ్రమ్ములు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఎయిర్ కూలర్స్, ఫ్రిజ్ వెనక బాక్స్, రుబ్బురోలు, ఫ్లవర్ వాజులు, పూల కుండీలు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమల నిర్మూలన సామాజిక బాధ్యతగా భావించాలని దానిలో విద్యార్థులు పాత్ర కీలకమని సూచించారు. నరసింహారావుపేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వలన డయేరియా, జిగట విరోచనాలు, కామెర్లు, టైఫాయిడ్, నులిపురుగు తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, కాబట్టి విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత ఆచరించాలని సూచించారు. అనంతరం ర్యాలీ మానవహారం నిర్వహించారు ఈ కార్యక్రమం హెల్త్ సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సాలో ఫ్రెషర్స్ డే వేడుకలు



మిస్ ఫ్రెషర్ టైటిల్ గెలుచుకున్న సబ్రినాలీస్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్నేహపూర్వక వాతావరణంలో కొత్త విద్యార్థులను స్వాగతించడం, వారిలో విశ్వాసాన్ని పెంచడం, వారిలో సృజనాత్మకతను వెలికితీయడమే ఫ్రెషర్స్ డే ముఖ్య ఉద్దేశం అని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల పీజీ డైరెక్టర్ సిస్టర్ సుశీల అన్నారు. స్థానిక సెయింట్ థెరిసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలలో సిస్టర్ సుశీల పాల్గొని ప్రసంగించారు. సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచి కళాశాల పేరు ప్రఖ్యాతులను ఇనుమడింప చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జూనియర్ విద్యార్థినులకు మిస్ ఫ్రెషర్ పోటీలు నిర్వహించారు. ఆంగ్ల విభాగాధిపతి ఫాతిమా, జువాలజీ విభాగాధిపతి ఇందిర, తెలుగు హిందీ విభాగాధిపతి డాక్టర్ మహాలక్ష్మి పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సి ఆధ్వర్యంలో అప్‌లెడ్ సైన్సెస్ విభాగాధిపతి పద్మావతి, అధ్యాపకులు స్టెల్లా, పావని, అవని తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు

- జేసీబీ నిలుపుదల.. ఆపరేటర్ స్టేషన్‌కు తరలింపు
- కేసు లేకుండా చేసేందుకు టీడీపీ నేతల విశ్వప్రయత్నాలు



గుళ్లపాడు వద్ద పోలీసులు నిలుపుదల చేసిన జేసీబీ

ద్వారకాతిరుమల: పోలవరం కుడి కాలువ గట్టుపై టీడీపీ నేతల అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ క్రమంలో మండలంలోని గుళ్లపాడు వద్ద బుధవారం సాయంత్రం ఈ తవ్వకాలను పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై కేసు నమోదు కాకుండా చేసేందుకు సదరు నేతలు పైరవీలు సాగిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం. మండలంలోని గుళ్లపాడు వద్ద పోలవరం కుడి కాలువ గట్టును గత కొద్దిరోజులుగా లైన్ గోపాలపురానికు చెందిన కొందరు టీడీపీ నేతలు అక్రమంగా తవ్వి, మట్టిని వేలాది రూపాయలకు అమ్ముకుంటున్నారు. మట్టి కావాల్సిన వారు తవ్వకాలు జరిగే ప్రాంతానికి వెళితే చాలు.. ట్రాక్టరుకు ఇంత, టిప్పర్‌కు ఇంతని తీసుకుని లోడింగ్ చేస్తున్నారు. అలా వచ్చిన సొమ్ముతో సదరు నేతలు వారి జేబులు నింపుకుంటున్నారు. పైసా ఖర్చు లేకుండా నిత్యం లక్షలాది రూపాయలు సొమ్మును స్వాహా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. దీని ఫలితంగా తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలు అగాథాలను తలపిస్తున్నాయి. గుళ్లపాడు వద్ద జరుగుతున్న తవ్వకాలను పోలీసులు అడ్డుకునేందుకు వెళ్లగా ట్రాక్టర్ డ్రైవర్లు తమ వాహనాలతో అక్కడి నుంచి ఉడాయించారు. దీంతో పోలీసులు జేసీబీని నిలుపుదల చేసి, ఆపరేటర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే జేసీబీ భీమడోలుకు చెందిన టీడీపీ నాయకుడిది కావడంతో కేసు నమోదు కాకుండా చేసేందుకు సదరు నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ధాన్యం సొమ్ములు చెల్లించాలని కోరుతూ ఆందోళన

కొయ్యలగూడెం: దళారుల చేతిలో మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ గవరవరం గోడౌన్ వద్ద పోలవరం మండలానికి చెందిన రైతులు బుధవారం రెండో రోజు ఆందోళన సాగించారు. ఈ ఆందోళనకు సీపీఎం, ఏపీ రైతు సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో దళారులు రైతుల వద్ద నుంచి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా దాదాపు రూ.3.5 కోట్లు చెల్లించకుండా మోసం చేయడం దారుణమని విమర్శించారు. బాధిత రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ రైతుల న్యాయమైన పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు.

సాగు సాయం కోసం ఎదురుచూపులు

- పెట్టుబడి సాయంపై ప్రభుత్వం మీనమేషాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



మల్కాపురంలో రైతులు చురుగ్గా చేస్తున్న సాగు పనులు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ గ్రామాల్లో ఇప్పటికే ఖరీఫ్ ప్రారంభమైనా నేటికీ ప్రభుత్వ సాయం మాత్రం అందలేదు. ఇప్పటికే వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రభుత్వం అందించే సాగు సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. మరోపక్క కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడంపై మీనమేషాలు లెక్కిస్తోంది. అర్హుల జాబితా పక్కాగా ఉన్నప్పటికీ సాయం చేయడంలో జాప్యం చేస్తోంది. దీంతో రైతు భరోసా పథకంపై సాగుదారుల్లో అందోళన నెలకొంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గత ఐదేళ్లు ఖరీఫ్ సాగుకు కొద్దిరోజుల ముందే మొదట విడత సాయం రూ.5500 రైతుల ఖాతాల్లో జమ చేసేది. కాని నేటి ప్రభుత్వం నేటికీ సాగు సాయంపై ప్రకటన చేయలేదు. దీంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఐదేళ్లు ఏడాదికి రూ 13,500 అందించింది. టీడీపీ ప్రభుత్వం రూ.20 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

గత ప్రభుత్వం ఇలా

గత ప్రభుత్వం హయాంలో వ్యవసాయం పండుగలా మారింది. రైతు భరోసా పథకం కింద ఒక్కొక్క రైతు ఏడాదికి రూ.13,500 అందుకున్నారు. మొదట విడతగా రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు ముందే రూ 5500 అందించింది. రెండో విడతగా మరో రూ 2000 జమ చేసింది. దీనికి తోడు పీఎం కిసాన్ పథకం నిధులు సైతం రూ.2 వేల చొప్పున మూడు పర్యాయాలు అందించేది. ఇలా ఏడాదికి సరాసరి 2800 మంది లబ్ధిదారులకు సుమారు రూ.3 కోట్ల 90 లక్షలు అందించింది. ఐదేళ్ల చొప్పున రూ.18 కోట్ల 30 లక్షలను ఏడాది పొడవునా సాయం అందుతూ ఉండడంతో రైతులు చేతిలో డబ్బులు పుష్కలంగా ఉండేవి. ఫలితంగా వ్యవసాయం పనులు ఉధృతంగా సాగేవి. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు సాయం అందిస్తామని ఎన్నికల హామీలో ఊదరగొట్టి అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభమైనా ఇప్పటివరకు పెట్టుబడి సాయంపై నోరు విప్పడం లేదు. అసలు మొదట విడతగా ప్రభుత్వం ఎంత సాయం చేస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

కొనసాగుతున్న రుణ పత్రాల పంపిణీ

మండలంలో రైతన్నలు సాగు సాయం కోసం ఎదురు చూస్తుంటే అధికారులు మాత్రం రుణ అర్హత పత్రాలు మంజూరు చేస్తున్నారు. దీంతో రైతుల్లో కొత్త కొత్త ఆందోళనలు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది సాగు సాయం చేయకుండా బ్యాంకుల నుంచి రుణాలు ఇస్తుందని కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే కనుక జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోతారు. వ్యవసాయం మరోసారి నష్టాల్లోకి వెళుతుందని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయమేస్తోంది

ప్రభుత్వం ఇప్పటివరకూ సాగు సాయం చేయకపోవడంతో భయమేస్తోంది. పెట్టుబడి కోసం ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఏడాదికి రూ.20 వేలు సాయం చేస్తానని చంద్రబాబు ఎన్నికల్లో ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనలు చేయలేదు. రైతులు ధైర్యంగా సాగు చేయాలంటే ప్రభుత్వం పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలి.

– ఏ రామకృష్ణ, చొదిమెళ్ల

అమలుపై అనుమానాలు

రైతు భరోసా పథకం అమలు చేస్తారా లేదా అనుమానాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటి వరకూ ఒక్క పైసా కూడా నా ఖాతాలో జమ కాలేదు. ఇప్పటికే రూ.5వేలు పెట్టుబడి పెట్టాను. ఇకనుంచి అప్పుల కోసం తిరగాలి. గతంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ఇప్పటికే రూ.5500 మంజూరు చేసేవారు.

– వి.బాబు, చొదిమెళ్ల